

చెరువులు నింపే ప్రణాళిక సిద్ధం చేయండి

కర్నూలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిన్ననీటి పారుదల (ఎంఐ) చెరువులు నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జలవనరులు శాఖ ఎస్ఈలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 6న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్షలో సీజన్‌లో ప్రతి చెరువును నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ నీటి వనరులు ద్వారా ఎత్తిపోతలు, గ్రావిటీ ద్వారా ఏఏ చెరువులను నింపడంపై సమగ్రంగా సర్వే చేసి ప్రభుత్వానికి పంపాలని బుధవారం ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీరు (సీఈ) ఎస్ఈలకు ఆదేశాలు జారీ చేశారు.

ఎత్తిపోతలు ఎన్నడో!

పశ్చిమ ప్రాంతం కరువు నేలను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర విభజన తరువాత టీడీపీ హంద్రీ నీవా కాలువ నుంచి 68 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోసే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల పనులు నత్తతో పోటీ పడ్డాయి. ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి సీఎం జగన్ ప్రారంభించారు. ప్రస్తుతం హంద్రీ నీవా కాలువలో నీటి ప్రవాహం ఉన్నా చెరువులకు నీటిని ఎత్తిపోయడం లేదు. పంపులు ఆన్ చేయడం లేదు. వరద ఉన్నప్పుడే చెరువులు నింపితే రైతుల జల ప్రయోజనాలు కాపాడవచ్చని పలువురు అంటున్నారు. నిత్యం కరువు దరువేసే పశ్చిమ ప్రాంత పల్లెసీమల్లోని చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోసేది ఎన్నోడో..? అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

- హంద్రీ నీవా నుంచి 68 చెరువులకు నీరు ఎత్తిపోసే పథకం
- టీడీపీ ప్రభుత్వంలో రూ.253 కోట్లతో శ్రీకారం
- వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల నిర్లక్ష్యం
- కళ్ల ఎదుటే కృష్ణా జలాలు.. కరువు నేలను తడపని వైనం



హంద్రీనీవా కాలువ వద్ద నిర్మించిన పంపింగ్ స్టేషన్

కర్నూలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ పత్తికొండ, డోన్, పాణ్యం, ఆలూరు నియోజకవర్గాల మీదుగా ప్రవహిస్తుంది. కళ్ల ఎదుటే కృష్ణా జలాలు సీమ జల్లాలకు తరలిపోతున్నా.. కందనవోలు ముంగిట మెట్ట పొలాలకు మళ్లించలేని పరిస్థితి ఉంది. రాయల కాలంలో తవ్విన చెరువులు వర్షాభావం వల్ల ఒట్టిపోతున్నాయి. ఆ చెరువుల కింద ఆయకట్టు రైతుల వర్షాధారంగా పంటలు సాగు చేయాల్సి వచ్చింది. అంతేకాదు పశువులు సైతం తాగునీటికి అవస్థలు పడాల్సిన పరిస్థితి. హందీనీవా కాలువకు కుడి, ఎడమ వైపులా ఆయా గ్రామాల్లో ఉన్న 105 చెరువులకు హంద్రీనీవా నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసి పల్లెసీమ రైతుల కన్నీళ్లు తుడవాలనే సంకల్పంతో ఆనాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కోరిక మేరకు నాటి సీఎం చంద్రబాబు 1.238 టీఎంసీలు ఎత్తిపోసి 68 చెరువులకు నీటిని ఎత్తిపోసేందుకు సంకల్పించారు. అందులో భాగంగా ఫేజ్-1 కింద రూ.224.31 కోట్లు మంజూరు చేస్తూ 2018 మార్చి 20న జీఓ నంబరు 169 జారీ చేశారు. అదే ఏడాది ఆగస్టు 23న కోయా కంపెనీ జలవనరుల శాఖతో అగ్రిమెంట్ నంబరు 14/2018-19 కింద ఒప్పందం చేసుకుంది. 24 నెలలు అంటే 2020 ఆగస్టు నాటికి పూర్తి చేసేలా పనులు మొదలు పెట్టి 35 శాతానికి పైగా పనులు చేశారు. 2019 మేలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనుల పురోగతి పడకేసింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కొంత చొరవతీసుకున్నారు. డోన్ నియోజవర్గంలోని చెరువులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారు. ఎన్నికల ముందు హడావుడిగా గత సీఎం జగన్ చేతల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. పత్తికొండ నియోజకవర్గంలో 33, డోన్ నియోజకవర్గంలో 31, ఆలూరులో 3, పాణ్యం నియోజకవర్గంలో 2 కలిపి 69 చెరువులకు నీళ్ల ఇచ్చేందుకు ట్రయల్ రన్ చేస్తున్నట్లు ఇంజనీర్లు అంటున్నారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలువ నుంచి కృష్ణా జలాలు జిల్లా సరిహద్దులు దాటి అనంతపురం జిల్లాకు తరలిపోతున్నాయి. అయినా చెరువులకు నీటి ఎత్తిపోతలు చేపట్టకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● నిర్వహణ నిధులేవి..?

హంద్రీనీవా నుంచి 68 చెరువులు నింపే ఎత్తిపోతల పథకం సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, నిర్వహణ కోసం రూ.1.50 కోట్లు నిధులు ఇవ్వాలని ఇంజనీర్లు గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. అదే క్రమంలో ఒప్పందం మేరకు ట్రియల్ రన్ పూర్తి చేసి ఇరిగేషన్ శాఖకు అప్పగించాం.. ఆ తరువాత పంపులు ఆన్ చేసి చెరువులకు నీటి మళ్లించే బాధ్యత మాదికాదని కాంట్రాక్ట్ సంస్థ చేతులెత్తేసింది. నిధుల లేమితో చెరువులు నింపే పనులు చేపట్టలేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చాక కూడా నిర్వహణ కోసం రూ.1.50 కోట్లు ఇవ్వాలని జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ కబీర్ బాషా ద్వారా ప్రభుత్వానికి పంపారు. నిధులు తప్ప హంద్రీ నీవా నుంచి చెరువులు నింపే కార్యక్రమం చేపట్టలేని పరిస్థితి. ప్రధాన ఎత్తిపోతల పథకం, పంపింగ్ స్టేషన్, పైపులైన్ నిర్వహణ కోసం సిబ్బంది జీతాలు ఇవ్వకపోతే స్కీం నిర్వహణ కష్టమనే అంటున్నారు. డోన్, పత్తికొండ, పాణ్యం ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, కేఈ శ్యాం బాబు, గౌరు చరితలు ప్రత్యేక చొరవ తీసుకుని నిర్వహణ నిధులు మంజూరు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే చెరువుల కింద ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.


కటారుకొండ వద్ద నిర్మించిన డెలివరీ పాయింట్ (ఫైల్)


హంద్రీనీవా ప్రధాన కాలువ


తుగ్గలి మండలం జొన్నగిరి చెరువు

తక్షణమే చెరువులు నింపేందుకు చర్యలు చేపడతాం

హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువులకు కృష్ణా జలాల ఎత్తిపోతల పనులు రెండు మూడు రోజుల్లో చేపడతాం. ట్రయల్ రన్ చేసిన తరువాత ఆ ప్రాజెక్టును కాంట్రాక్ట్ సంస్థ ఇరిగేషన్ శాఖకు అప్పగించింది. సిబ్బంది జీతాలు, నిర్వహణ కోసం రూ.1.50 కోట్లు నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

- రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు

● ఎత్తిపోసేదెన్నడో..?

శ్రీశైలం జలాశయం ఎగువన మల్యాల లిఫ్టు నుంచి ఈ నెల ప్రారంభంలో హంద్రీనీవా కాలువకు కృష్ణాజలాల ఎత్తిపోతలు చేపట్టారు. 15 రోజులు దాటినా 68 చెరువులకు నీటిని ఎత్తిపోత పనులు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.50 అడుగుల్లో 201.58 టీఎంసీల నిల్వ ఉంది. సుంకేశుల బ్యారేజీ, జూరాల నుంచి 69,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మాల్యాల మెయిన్ లిఫ్ట్ నుంచి హంద్రీనీవా కాలువకు 1,688 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. వరద ఉన్నా చెరువులకు నీటిని ఎత్తిపోతలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎమ్మెల్యేలు స్పందించి ఇంజనీర్లతో మాట్లాడి చెరువులు నింపే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు నష్టం కలగొద్దు

- నూరు శాతం సెస్సు వసూలు చేయాల్సిందే
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత


వేరుశనగను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 21: కర్నూలు మార్కెట్ యార్డులో రైతులకు ఎటువంటి నష్టం, కష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను పరిశీలించారు. వారి సమస్యలను ఆలకించారు. ఉల్లి, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందుతుందా లేదా? అని రైతులను ఆరా తీశారు. వేరుశనగ కాయలను తెచ్చిన రైతులు తమకు ఒక కుప్పపై క్లీనింగ్ పేరుతో రూ.100 నుంచి రూ. 200 దాకా వసూలు చేస్తున్నారని, దీన్ని అరికట్టాలని కోరారు. మార్కెట్ యార్డు బయటి ప్రాంతం కంటే తగ్గులో ఉన్నందున వర్షం వచ్చినప్పుడు దుకాణాల్లోకి నీరు చేరుతోందని కమిషన్ ఏజెంట్లు తెలిపారు. జంబో ప్లాట్‌ఫారం నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టరు పనులు నిలిపివేశాడని డీఈ సుబ్బారెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కోల్డ్ స్టోరేజీ ప్లాంటును కమిషనర్ పరిశీలించారు. ఆ తర్వాత కమిషనర్ సెక్రటరీ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏడాది పొడవునా పంట ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నందున నూరు శాతం సెస్సు వసూలుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సౌకర్యాలన్నీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ యార్డులో ఏవైనా సమస్యలు ఉన్నా, అక్రమాలు జరుగుతున్నా.. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కమిషనర్ వెంట జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్ రెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి, ఏడీఎం నారాయణమూర్తి, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

90 శాతం జీడీపీ మరమ్మతులు పూర్తి

- పెండింగ్‌లో రూ. 30 కోట్లు
- బిల్లులు వస్తేనే మిగతా పనులు
- రెండు గేట్లను ట్రయల్ రన్ చేసిన ఎస్ఈ


కట్ట మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జిల్లా ఇరిగేషన్ అధికారులు

గోనెగండ్ల, ఆగస్టు 21: గాజులదిన్నె ప్రాజెక్టు పనులు దాదాపు 90 శాతం పూర్తి అయినట్లు జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం గాజులదిన్నె ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. గతంలో జరిగిన పనులు ఎంత వరకు పూర్తి అయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు ఉన్న ఆరు గేట్లలో ఐదు గేట్లను కొత్తగా తయారు చేశారు. అందులో ఐదు, ఆరు నెంబరు గల రెండు గేట్లను ట్రయల్ రన్ చేసి ఎస్ఈ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న మిగతా గేట్‌ను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు మరమ్మతు పనులు కేవలం 10 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని అయితే గతంలో చేసిన పనులకు గాను బిల్లులు రూ. 30 కోట్లు పెండింగ్ ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతానికి చెందిన రైతులు ఆవేదన చెందాల్సిన అవసరం లేదని ప్రాజెక్టుకు ఎంత నీరు వచ్చినప్పటికీ 4.5 టీఎంసీల నీటిని మాత్రమే నిలువ చేస్తామని మిగతా నీటిని హంద్రీకి వదులుతామని అన్నారు. ప్రాజెక్టు మరమ్మతు పనులలో భాగంగా 440 ఎకరాలు ఎగువ ప్రాంతంలో భూమి కావాల్సి ఉందని అయితే, 300 ఎకరాల భూమిని సర్వే చేశామని మిగతా భూమిని సర్వే చేయాల్సి ఉందని అన్నారు. రైతులకు భూమి పరిహారం అందజేసిన తర్వాతే పనులు పూర్తి చేసి అప్పుడు ప్రాజెక్టులో 5.5 టీఎంసీల నీటిని నిలువ చేస్తామన్నారు. ప్రాజెక్టు భద్రత పట్ల సందేహం అవసరం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల అయితే మిగతా పనులను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శైలేశ్వర్, డీఈ విజయ్‌కుమార్, ఏఈ మహమ్మద్ ఆలీ, ఉగ్రనరసింహుడు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి : కలెక్టర్

కర్నూలు (కలెక్టరేట్), ఆగస్టు 21: గంజాయి వంటి మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మత్తుపదార్థాలను వినియోగించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందు కోసం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ, తనిఖీలను పెంచాలన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో గట్టి నిఘా ఉంచాలన్నారు. అంతర్ పంటగా గంజాయి సాగు చేసే అవకాశం ఉందని, అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు ఇది గమనించాలని అన్నారు. జిల్లా సరిహద్దుల్లో తిరిగే బస్సులు, బస్టాండ్లపై కూడా నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలని అన్నారు. ఎస్పీ జి. బిందు మాధవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై యువతతో అవగాహన కల్పించేందుకు హోర్డింగ్స్ ఏర్పాటు చేయడంతో పాటు 30 ప్రభుత్వ కళాశాలలు, 44 ప్రైవేటు కళాశాలల్లోని విద్యార్థులకు అవగామన కల్పించామన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, అటవి శాఖ అధికారి శ్యామల, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, డీటీసీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు, ఎద్దు మృతి

వెల్దుర్తి, ఆగస్టు, 21: విద్యుదాఘాతంతో ఓ రైతు, అతని ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో గోవర్ధనగిరి గ్రామంలో బుధవారం జరిగింది. రైతు మద్దిలేటి (63) బుధవారం తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో టాయిలెట్‌కు వెళ్లడానికి లేచాడు. ఎద్దు కిందపడిపోయి ఉండడాన్ని గమనించిన రైతు ఎద్దును లేపడానికి వెళ్లి పగ్గం పట్టుకోగా విద్యుత్‌షాక్ తగిలి పక్కనే ఉన్న ఫెన్సింగ్‌పై కుప్పకూలాడు. పశువుల దొడ్డి పక్కన ఆనుకొని ఉన్న కంచె మీద విద్యుత్ ప్రసరిస్తున్న కరెంట్ తీగ తెగిపడడంతో ఎద్దు, రైతు చనిపోయారు. విద్యుత్ అధికారులు స్తంభం వద్ద తీగ కత్తిరించకుండా, ఇంటి మీటరు వద్ద తీగ కత్తిరించడంతో గాలులకు కరెంట్ తీగ కంచె మీద పడటంతో ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వరద ప్రభావిత పంటలను పరిశీలించిన జేసీ

దేవనకొండ, ఆగస్టు 21 : హంద్రీకి వరద పోటెత్తడంతో నీట మునిగిన పంటపొలాలను జాయింట్ కలెక్టర్ నవ్య పరిశీలించారు. మండలంలోని తెర్నేకల్, పొట్లపాడు, అలారుదిన్నె గ్రామాలలో బుధవారం జేసీ పర్యటించారు. వరదలో పంటను నష్టపోయిన రైతులను కలుసుకొని, వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతికి మిరప, టమోట, ఉల్లి, పత్తి, కంది, వేరుశనగ తదితర పంటలు రైతులు నష్టపోయారని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి జేసీకి వివరించారు. వరద ప్రవాహంతో పంటలు నష్టపోవడానికి కారణం విశాలంగా వుండాల్సిన హంద్రీ నదిలో పూడిక విపరీతంగా పేరుకుపోయి, ఏపుగా చెట్లు పెరగడంతోనేనని తెర్నేకల్ గ్రామస్తులు జేసీ దృష్టికి తీసికెళ్లారు. తహసీల్దార్ జయ్యన్న, ఏడీఏ మోహన్ విజయ్, ఏఈవో జయరాం, తెర్నేకల్ సర్పంచు ఆరుణ్‌కుమార్ వీఆర్వో దాదావలి, పంచాయతీ కార్యదర్శి రాముడు, సలీం తదితరులు ఉన్నారు.

9 లోగా దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 21: హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025 సంబంధించి హజ్ యాత్ర కోసం వెళ్లేవారు సెప్టెంబరు 9వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా. సునీల్ కన్నా బుధవరం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2024 నుంచి ప్రత్యేక హజ్ సువిధ యాప్‌ను ప్రారంభించింది. దరఖాస్తుదారులు హజ్ కమిటీ సైట్ www.hajcommittee.gov.in/, www.apstatehajcommittee.com ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏపీ రాష్ట్ర హజ్‌కమిటీ ద్వారా సహాయాన్ని వ్యక్తిగతంగా లేదా టోల్ ఫ్రీ లేదా 1800-4257873, 0866-2471786 లేదా మెయిల్ aphajcommittee@gmail.com ద్వారా పొందచ్చునన్నారు.

అనధికార లే అవుట్లకు నోటీసులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 21: నగర పాలక సంస్థ పరిధిలో అనధికారికంగా వేసి లేఅవుట్లకు నోటీసులు జారీ చేస్తూ కమిషనర్ పివి. రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనధికార లేవుట్లు, ప్లాట్లలో ప్రజలు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కొనుగోలు చేయరాదని ఆయన సూచించారు. నగర పాలక పరిధిలో మొత్తం 35 అనధికారి లే అవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారన్నారు. ఇలాంటి వాటిలో స్థలం, ప్లాట్లు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని, భవిష్యత్తులో అమ్మకానికి, కొనుగోలుకు వీలు ఉండదని ఆయన పేర్కొన్నారు. అనధికారి లేఅవుట్లలో మౌలిక వసతులు నగర పాలక సంస్థ చేపట్టబోదని ఆయన స్పష్టం చేశారు.

ఉర్దూ వర్సిటీలో ఎంసీఏ కోర్సు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 21: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎంసీఏ కోర్సు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్న ఎంసీఏ కోర్సులో 30 సీట్లు మంజూరు అయ్యాయన్నారు. ఏపీ ఐసెట్ 2024 ద్వారా రెండో విడత కౌన్సెలింగ్‌లో ఎంసీఏ కోర్సులో చేరే విద్యార్థులు యూనివర్సిటీ కోడ్ ఏహెచ్‌యూయూను ఎంపిక చేసుకుని ఆప్షన్లు ఇచ్చుకోవాలని తెలిపారు.

కుందూ నదిలో యువకుడు గల్లంతు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 21: కుందూ నదిలో యువకుడు గల్లంతైనట్టు నంద్యాల తాలూకా అర్బన్ సీఐ అస్రార్ భాష బుధవారం తెలిపారు. మండలంలోని రాయమాల్‌పురం గ్రామం సమీపంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి పోయి కొట్టుకుపోవడాన్ని స్థానికులు గుర్తించారు. వరదతో కుందూ నది ఉధృతంగా ప్రవహించడంతో స్థానికులు ఆ యువకుడిని కాపాడలేకపోయారు. నంద్యాల తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ అస్రార్ భాష, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడి ఆచూకి లభించలేదని గురువారం కూడా గాలింపు చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

జీడీపీని పరిశీలించిన ఎస్పీ

- గంజహళ్లి, ఐరన్‌బండ గ్రామాలో జరిగిన సంఘటన పై ఆరా



జీడీపీ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

గోనెగండ్ల ఆగస్టు 21: గాజుల దిన్నె ప్రాజెక్టును బుధవారం సాయంత్రం ఎస్పీ బిందుమాధవ్ పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని జీడీపీ ఇరిగేషన్ డీఈ విజయ్ కుమార్ ఎస్పీకి వివరించారు. అలాగే ఎస్పీ మంగళవారం సాయంత్రం గంజహళ్లి, ఐరన్‌బండ గ్రామాలకు చెందిన రైతులు వరద నీటిలో చిక్కుకున్న సంఘటనకు సంబందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు తగు సమయంలో స్పందించడంతో రెండు గ్రామాలకు చెందిన రైతులు క్షేమంగా బయట పడ్డారని ఎస్పీకి వివరించారు.. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మహమ్మద్‌ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఉద్యోగాలతో మోసం

కర్నూలు, ఆగస్టు 21: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి.. కొన్ని నెలలు జీతాలు ఇచ్చి.. మోసం చేసిన ముగ్గురుని తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. షేక్ జహీర్‌బాషా (బాలాజీనగర్, కర్నూలు), ఆయేషా బాను (బాలాజీనగర్, కర్నూలు), ఆమె భర్త షేక్ మహ్మద్ జాకీర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. షేక్ జహీర్‌బాషా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ గ్రేడ్-3 ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బాలాజీనగర్‌లో ఉన్న తన చెల్లెలు షేక్ ఆయేషాబాను, ఆమెభర్త షేక్ జాకీర్‌లతో కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేసుకున్నారు. రామచంద్రనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా అనే వ్యక్తికి, మరి కొంత మందికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్నారు. వీరికి ఎఫ్‌సీఐ సంస్థకు చెందిన నకిలీ సీళ్లు, లెటర్ ప్యాడ్లు, రాజముద్రలు తయారు చేసి డబ్బులు కట్టినవారందరికీ నకిలీ అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. వారికి అనుమానం రాకుండా వర్క్ ఫ్రమ్ హోమ్ అని చెప్పి ఇంటి వద్దనే కొన్ని నెలలు పని చేయించారు. పని చేసిన నెలలకు సొంతంగా జీతాలు చెల్లించారు. అలా వారి ద్వారా మరి కొంత మంది నిరుద్యోగులు భారీ మొత్తంలో డబ్బులు చెల్లించారు. తీరా తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

ఐదుగురు మహిళల అరెస్టు

ఆదోని రూరల్ ఆగస్టు 28 : ఆదోని పట్టణం ఒకట పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఐదుగురు మహిళలను తాలుక పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ బస్సులో కర్ణాటక మద్యం తరలిస్తున్నారని సమాచారంతో రూరల్ సీఐ నల్లన్న, ఎస్.ఐ రామాంజనేయులు బుధవారం బైచిగేరి క్రాస్ వద్ద దాడులు నిర్వహించి సరోజ, ఈరమ్మ, లక్ష్మీ, హనుమంతమ్మ, మానసలను అదుపులో కి తీసుకొని వారి వద్ద నుంచి రూ.40వేలు విలువ చేసే 700 కర్ణాటక మద్యం పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఆదోని, ఆగస్టు 21: ఆదోని పట్టణంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితుడు పట్టణంలోని ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత ఆ బాలికను మోసం చేసి ఇంటికి పంపించాడు. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు మేరకు తాము కేసు నమోదు చేసి మైనర్ బాలికను మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రామలింగప్ప తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ నాయకుడిపై దాడి

దేవనకొండ, ఆగస్టు 21 : మండల బీజేపీ నాయకుడు బోడ రవికుమార్‌పై కుంకనూరు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాత్రి టర్నింగ్ సమీపంలో కుంకనూరు గ్రామానికి చెందిన బండారి తిమ్మప్ప, లక్ష్మన్న, సోమన్న అనే వ్యక్తులు రవికుమార్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. న రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు.



అహోబిలం నుంచి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ప్రధాన అర్చకులు



శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు



వీణ వాయిస్తున్న కళాకారులు



పట్టువస్త్రాలను పీఠాధిపతికి సమర్పిస్తున్న అహోబిలం అర్చకులు

జయహో రాఘవేంద్ర..

- స్వర్ణరథంపై విహరించిన రాఘవరాయలు
- బృందావనానికి మహా పంచామృతాభిషేకం
- గజవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- ఘనంగా కొనసాగుతున్న సప్తరాత్రోత్సవాలు



బృందావనానికి మహాభిషేకం చేస్తున్న పీఠాధిపతి



అశేష భక్తజనవాహిని మధ్య బంగారు రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రుడు



బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 21: ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక మఠం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 353వ సప్తరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ముఖ్యమైన నాలుగో రోజు మధ్యారాధనకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన సందర్భంగా మధ్యారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతి చేతుల మీదుగా మహావిశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నుంచి ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్ పట్టువస్త్రాలను సమర్పించారు. మఠం ప్రధాన ముఖద్వారం నుంచి రాఘవేంద్రస్వామి బృందావనం వరకు పట్టువస్త్రాలను ఘనంగా ఊరేగింపుతో తీసుకువచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి ఉత్సవమూర్తిని స్వర్ణ రథంపై అధిష్ఠించి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహా మంగళహారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాలు, భక్తుల హర్షధ్వానాల నడుమ రాఘవేంద్రులవారు విహరిస్తుండగా భక్తులు భక్తిపారవశ్యంతో తన్మయం చెందారు. రథం ముందు భాజాభజంత్రీలు, కోలాటాల నృత్యాలు, మహిళల భక్తిగీతాలు, ఆహ్వానం పలుకుతూ ఊరేగిస్తున్న దృశ్యం భక్తులను కనువిందు చేశాయి. దక్షిణాది రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనవాహినితో మంత్రాలయం మఠం ప్రాంగణం మార్మోగింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహిత విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, విచారణకర్త శ్రీనివాస్ ఖస్బే, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సూపరింటెండెంట్ రవి కులకర్ణి, సుజీంద్రచార్, విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, నకటే శ్యాంప్రసాద్, వ్యాసరాజాచార్, డీఎం ఆనందరావు, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

● **అలరించిన భరతనాట్యం:** మధ్యారాధనలో భాగంగా బుధవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు, మైసూరు చెందిన కళాశిల్ప క్షేత్ర నటరాజ్ కళాబృందం ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. శివమొగ్గకు చెందిన సరస్వతి, సంగీత విద్యాలయ వారిచే వీణావాయిద్యం భక్తులను కనువిందు చేసింది. వీరికి పీఠాధిపతులు నగదు, శేషవస్త్రం, ఫలపుష్ప, మంత్రాక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు.

● **రాఘవేంద్రస్వామి సన్నిధిలో ప్రముఖులు:** ఉత్సవాల్లో నాల్గవ రోజు బుధవారం తమిళనాడు మాజీ మంత్రి చిన్నయ్య, కర్ణాటక హైకోర్టు జస్టిస్ శ్రీశానందా, ఇన్ఫోసిస్ ఛైర్‌పర్సన్ సుధానారాయణమూర్తి, గౌహతి రిటైర్డ్ చీఫ్ జడ్జి శ్రీధర్‌రావు, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస్‌రావు, కన్నడ సినీ నటుడు, రాజ్యసభ సభ్యులు జగ్గేష్, ఆర్టీఓ చల్లా విశ్వనాథ్, డీఎస్పీ సోమన్న, టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి వేర్వేరు సమయాల్లో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.

నేడు మహా రథోత్సవం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఉత్తరాధనలో భాగంగా గురువారం రాఘవేంద్రుల మహారథోత్సవం వైభవంగా జరగనుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహాముఖద్వారం ముందు ఉంచిన మహారథంపై అధిష్ఠించి హారతులు ఇచ్చి భక్తులనుద్దేశించి పీఠాధిపతి దివ్యసందేశాన్ని ఇస్తారు. అక్కడే మైసూరు మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్‌కు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2024 అవార్డును పీఠాధిపతి ప్రదానం చేయనున్నారు.



సింహ వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు



ఊంజల సేవ చేస్తున్న పీఠాధిపతి



టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డిని ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

త్వరలో అందుబాటులోకి క్యాన్సర్ ఆసుపత్రి

● **కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు**



స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న కర్నూలు ఎంపీ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 21: సాధ్యమైనంత త్వరగా స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రిని పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. బుధవారం ఎంపీ కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణంలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను సందర్శించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో క్యాన్సర్ హాస్పిటల్ పూర్తి కాలేదని దాదాపు 20 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆసుపత్రికి రావాల్సిన నిధులను తీసుకువచ్చి త్వరగా పూర్తి చేస్తామన్నారు. క్యాన్సర్ హాస్పిటల్ పూర్తయితే రాయలసీమ ప్రాంత ప్రజలు చికిత్స కోసం మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ఎంపీ వెంట కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, సీఎస్‌ఆర్‌ఎంవో వెంకటేశ్వర్లు, క్యాన్సర్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ కృష్ణ ప్రకాష్, నర్సింగ్ సూపరింటెండెంట్ అనుసూయమ్మ తదితరులు ఉన్నారు.

భార్యే చంపేసింది

- సారా వ్యాపారి హత్యకేసును ఛేదించిన పోలీసులు

- పోలీసులను అభినందించిన ఏస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఆదోని డీఎస్పీ సోమన్న

ఆదోని రూరల్, ఆగస్టు 21 : పెద్దహరివాణం సారా వ్యాపారి హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసం భర్త శేకన్న(50)ను మొదటి భార్యే చంపిందని పోలీసులు తేల్చారు. బుధవారం పత్రికా సమావేశంలో ఆదోని డీఎస్పీ సోమన్న, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, రూరల్ సీఐ నల్లన్న ఈ విషయం తెలిపారు. మొదటి భార్య జయమ్మే ఆస్తికోసం భర్తను చంపిందని అన్నారు బుధవారం నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సారా వ్యాపారి హత్యకేసును 48గంటల్లో ఛేదించడంతో ఆదోని రూరల్ పోలీసులను, డీఎస్పీని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

భూమి కోసం మహా మోసం..!

- అధికారుల సంతకాలు ఫోర్జరీ
- పెద్దకడబూరు పొలం.. కల్లూరులో రిజిస్ట్రేషన్
- సమాచార హక్కుచట్టంతో వెలుగులోకి..



న్యాయం చేయాలని వేడుకుంటున్న మహ్మద్ దేశాయ్, అస్లాం

ఆదోని, ఆగస్టు 21: ఆదోని డివిజన్‌లో రోజు రోజుకు పొలం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో కొందరు నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారు. ఇందుకోసం కీలక అధికారుల సంతకాలను సైతం ఫోర్జరీ చేసేందుకు వెనుకాడలేదు. పెద్దకడబూరు మండలం కల్లకుంట గ్రామానికి చెందిన హుస్సేన్ దేశాయ్, ఫాతిమా బీలకు ఉస్మాన్ దేశాయ్, గని దేశాయ్, అబ్దుల్ హమీద్, మమ్మద్, ఫరుదేశాయ్ ఐదుగురు సంతానం. వారిలో పెద్ద కుమారుడు ఉస్మాన్ దేశాయ్‌కి పెళ్ళి కాలేదు. దీంతో అక్కడి నుంచి ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. ఈయన 2015 నవంబరు 9న మృతి చెందాడు. ఆయనకు 312/1 సర్వే నంబర్‌లో 99 సెంట్లు, 389లో 3.60 ఎకరాలు, మొత్తంగా 4.59 ఎకరాల పొలం ఉంది. ఈ పొలాన్ని ఎలాగైనా సొంతం చేసుకోవాలని అబ్దుల్ హమీద్ దేశాయ్ భార్య హజరత్ బీ ప్లాన్ చేసింది. మిగతా కుటుంబ సభ్యులకు తెలియకుండా ఉస్మాన్ దేశాయ్ తమ కుటుంబంలో వ్యక్తి అని 2020 సెప్టెంబరు 12వ తేదీన హజరత్ బీ చనిపోయినట్లుగా అప్పటి తహసీల్దార్ డి.వెంకటసాయి డెత్ సర్టిఫికెట్ ఇచ్చినట్లుగా దొంగ సర్టిఫికెట్ పుట్టించారు. ఆ సమయంలో కుమారస్వామి అనే తహసీల్దార్ అక్కడ పనిచేస్తున్నారు. ఆ పొలాన్ని ఆక్రమించుకునేందుకు ఫ్యామిలీ సర్టిఫికెట్ అవసరం కావడంతో 2021 సెప్టెంబరు 12వ తేదీన హజరత్ బీ బతికున్నట్లు ఫ్యామిలీ సర్టిఫికెట్ పుట్టించారు. 2020లో చనిపోయినట్లు గాను 2021లో బతికున్నట్లు గాను ఫ్యామిలీ సర్టిఫికెట్ తయా రు చేయించారు. ఇదిలా ఉండగా ఉస్మాన్ దేశాయ్ పెద్ద తుంబలంలో అనారోగ్యంతో మృతిచెందగా పంచాయతీ కార్యదర్శి ఇవ్వాల్సి ఉన్న డెత్ సర్టిఫికెట్‌ను మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తయారు చేశారు. మొత్తం నకిలీ డాక్యుమెంట్లను సిద్ధం చేసుకుని కల్లూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్లి 2024 జూలై 12వ తేదీన ఆ పొలాన్ని ఎనీవేర్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ రికార్డులన్నీ సమాచార హక్కు చట్టం ద్వారా బయటకు తీయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యాయవాది చంద్రయ్యతో పాటు ఆ కుటుంబంలో ఉన్న సభ్యులందరూ కలిసి పెద్ద తుంబలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కల్లూరు సబ్ రిజిస్ట్రార్ షేక్ నాసీర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆర్‌వోఆర్, అడంగల్ సరిగ్గా ఉందని, అందుకే రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు.

రైతులను ఆదుకుంటాం : జేడీ

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 21: కర్నూలు జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎంత విస్తీర్ణంలో పంటలు రైతులు నష్టపోయారో గ్రామాలకు మండల వ్యవసాయాధికారులు, వారి సిబ్బంది పర్యటించి నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను అందజేశారని ఉద్యానశాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. కర్నూలు జిల్లాలో ఆలూరు మండలంలో 18 మంది రైతులు 4.76 హెక్టార్లలో సాగు చేసిన మిరప పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. అదే విధంగా ఆస్పరిలో 43.52 హెక్టార్లల్లో 30 మంది రైతులు నష్టపోయారని, దేవనకొండలో 29.88 హెక్టార్లలో 26 మంది రైతులు 4.65 లక్షల విలువ చేసే పంటలు దెబ్బతిన్నాయని, హొలహర్విలో రెండు హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, కౌతాళంలో 178 హెక్టార్లలో సాగు చేసిన పంటలు దెబ్బతిని 234 మంది రైతులకు రూ.30.26 లక్షల నష్టం జరిగిందని బుధవారం విలేకరుల సమావేశంలో జేడీ తెలిపారు. మద్దికెరలో 60హెక్టార్లలో సాగైన పంటలు దెబ్బతిని 55 మంది రైతులకు రూ.10.2లక్షల నష్టం జరిగిందన్నారు. మద్దికెరలో 60 హెక్టార్లు, మంత్రాలయంలో 74.5 హెక్టార్లు, పత్తికొండలో 131.2 హెక్టార్లు, మొత్తం పది మండలాల పరిధిలో 558.9 హెక్టార్లలో 695 మంది రైతులకు రూ.94.703 లక్షల నష్టం జరిగిందన్నారు. పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నట్లు జేడీ తెలిపారు. అదే విధంగా వ్యవసాయ పంటలకు 11 మండలాల పరిధిలో 58 గ్రామాల్లో వరి 550 హెక్టార్లు, పత్తి 2,777 హెక్టార్లు, వేరుశనగ 237 హెక్టార్లు, కంది 640 హెక్టార్లు, ఆముదం 18 హెక్టార్లు, సజ్జ 78 హెక్టార్లు, కొర్ర 5 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 2 హెక్టార్లు మొత్తం 4,307.69 హెక్టార్లలో వ్యవసాయ పంటల్లో నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి, ఆగస్టు, 21: మండలంలో సూదేపల్లె గ్రామానికి చెందిన మాల ఆంజనేయులు (34) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉన్న ఫ్యాన్ కొక్కెంకు తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వైసీపీ విధేయుల్లో వణుకు

» స్థానాలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు
» ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు



నగర పాలక సంస్థ కార్యాలయం

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 21: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు బదిలీ నుంచి తప్పించుకోడానికి మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎక్కడ తమ పదవికి గండం వస్తుందోనన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు వైసీపీ నాయ కులు, కార్యకర్తలకు తొత్తులుగా పని చేశారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాము చేసిందంతా ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో కొత్త ఎమ్మెల్యే ఇళ్ల వద్దకు ఉరుకులు పెడుతున్నారు. రెండు రోజుల క్రితం బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ జీఓ నెంబరు.75ని ప్రభుత్వం జారీ చేసింది. ఈ నెలా ఖరు వరకు బదిలీల ప్రక్రియ జరుగుతుంది. సెప్టెంబరు 1 నుంచి బదిలీలపై నిషేధం వస్తుంది. నగర పాలక సంస్థ పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. ఇందులో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం 33, పాణ్యం 16, కోడు మూరు 3 వార్డులు ఉన్నాయి. ఓ మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవడానికి అధికారులు, ఉద్యోగులు క్యూ కడుతున్నారు.

● **ఐదేళ్లుగా వైసీపీకి విధేయత..** నగర పాలక సంస్థ పరిధిలో అధికారులు, ఉద్యోగులు వైసీపీ నాయకులకు విధేయులుగా కొనసాగారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తిరుగులేని ఆధిక్యతను సాధించింది. విచక్షణ కోల్పోయి అధికార దర్పాన్ని ప్రదర్శించిన వారు ప్రస్తుతం టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కార్యాలయంలో వైసీపీకి విధేయతగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులపై వేటు పడటం ఖాయమైంది. కార్యాలయంలోని కొన్ని విభాగాలలో కొందరు అధికారులు, ఉద్యోగులు వైసీపీ ఏజెంట్లుగా పని చేశారు.

● **పైరవీలు ముమ్మరం..** కార్యాలయంలో పని చేస్తున్న కొందరు ఉద్యోగుల సర్వీసు 5 సంవత్సరాలు దాటింది. అలాంటి వారికి బది లీ అనివార్యం. ఎలాగైనా బదిలీని ఆపుకునేందుకు మంత్రి, ఎమ్మెల్యేల ఇంటి చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా కొందరు అధికారులు, ఉద్యోగులు విచక్షణ కోల్పోయి ప్రభుత్వానికి వీర విధేయులుగా పని చేశారు. కార్యాలయంలోని కొన్ని ఓ విభాగంలో వైసీపీకి విధేయత చూపలేక నలుగురు అధికారులు ఇతర జిల్లా, వేరే చోటికి బదిలీపై వెళ్లారు. మరికొందరు అధికారులు వైసీపీ నాయకులకంటే అత్యుత్సాహంతో పని చేశారు. పూర్తిగా విధేయత చూపి అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లాలని ఆలోచిస్తుంటే.మరి కొందరు ఎలాగైనా ఇక్కడే ఉండే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

పంచాయతీలకు నిధులు విడుదల

» 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా..
» పెండింగ్‌లో ఉన్న క్లాప్ మిత్ర వేతనాల చెల్లింపు
» డీపీవో నాగరాజు నాయుడు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 21: జిల్లాలో 482 గ్రామ పంచాయతీలకు గాను రూ.32,56,17,649 నిధులు విడుదలయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి అధికారి నాగరాజునాయుడు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలలో భాగంగా 2023-24వ ఆర్థిక సంవత్సరానికి గాను రెండో విడత నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులో బేసిక్ గ్రాంట్స్ కింద రూ.12,62,46,967, టైడ్ గ్రాంట్ కింద రూ.18,93,70,682 కేటాయించారన్నారు. ఈ నిధులు గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆదేశించారు.

ట్రాఫిక్ రద్దీపై స్పెషల్ డ్రైవ్

కర్నూలు, ఆగస్టు 21: నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బళ్లారి చౌరస్తా కూడలిలో మొబైల్ క్యాంటీన్లు, పండ్ల బండ్లు రోడ్డు మీద పెట్టి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ పెరిగిందని గుర్తించారు. ఈ నేపథ్యంలో కోడుమూరు నుంచి హైదరాబాదు వెళ్లే సర్వీసు రోడ్డు, డోన్ వైపు నుంచి కోడుమూరు వెళ్లే సర్వీసు రోడ్డు, హైదరాబాదు నుంచి కర్నూలు సిటీలో వచ్చే సర్వీసు రోడ్డు, ఆర్టీసీ బస్టాండు రాజ్‌విహార్ సర్కిల్ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాంతాల్లో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(లీగల్), ఆగస్టు 21: మహిళల హక్కులను పరిరక్షిస్తున్న పలు చట్టాలపై స్థానిక జొహరాపురంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే 100, 181, మహిళల హెల్ప్‌లైన్ నెంబర్ 1098లను సంప్రదిస్తే వెంటనే వారి ఇబ్బందులు తొలగించడానికి పోలీసులు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రామయ్య నాయుడు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ గౌస్, ఎస్ఐ నిర్మల, డీసీపీవో శారద, సెయింట్ ఆనస్ పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

షిరిడీ సాయి వృద్ధుల శరణాలయం తనిఖీ: స్థానిక షిరిడీ సాయి వృద్ధుల శరణాలయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధించిన రిజిస్టర్లను వారికి అందిస్తున్న భోజన వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

హాస్టళ్ల సమస్యలు తీర్చాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్నటువంటి మెస్, కాస్మొటిక్, ట్రంకు పెట్టెలు, ఖాళీగా ఉన్న కుక్, కామాటి, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని హాస్టల్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ముందు నిరసన దీక్షలకు పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో ఈ నెల 27న నిరసన దీక్షలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్, దస్తగిరి, శ్రీరంగ, జిల్లా సహాయ కార్యదర్శులు విజేంద్ర, రంగస్వామి, థామస్, వీరేష్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

సి.బెళగల్, ఆగస్టు 21: ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వైసీపీ నాయకులపై చర్యలు తీసుకుని ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని టీడీపీ మాజీ మండల కన్వీనర్, తిమ్మప్ప, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, ఎంపీటీసీ ఈరన్నగౌడు, విష్ణుసేన యువ నాయకుడు భీమన్న, మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్ కలిసి మండల కేంద్రంలో గ్రామానికి సమీపంలో ఉన్న కొండ పోరంపోకు భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని బండలు పాతుకున్న స్థలాన్ని బుధవారం టీడీపీ మండల నాయకులు పరిశీలించి ఇటీవల విధుల్లో చేరిన తహసీల్దార్ విజయశ్రీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ వెంకటేశ్, ముస్లిం మైనార్టీ నాయకుడు గౌస్, రామకృష్ణ, గోవిందు, బీసన్న ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 21: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచార,, హత్య సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఏఐఎస్‌డీవో, ఏఐడీవైవో, ఏఐఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ నాగస్వామి నాయక్ ప్రారంభించారు. ఈ ర్యాలీ సీ.క్యాంపు, గాయత్రీ ఎస్టేట్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ మానవతా విలువలు లేకపోవడం, సెల్‌ఫోన్ టెక్నాలజీ ద్వారా అసభ్యకరమైన వీడియోలు వీక్షించడం వల్ల ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ల్యాంప్ లైటింగ్ ఉత్సవ్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 21: నగర శివారులో ఉన్న కళాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నర్సింగ్ కాలేజీలో 2023-24 బ్యాచ్ నర్సింగ్ విద్యార్థుల ల్యాంప్ లైటింగ్ ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కర్నూలు ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు విశిష్ట అతిథిగా, టీటీడీ మాజీ కోఆర్డినేటర్ వై. సూర్య చంద్రరెడ్డి, కళాశాల చైర్మన్ పెరుగు విజయ్ వర్దన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్ కోర్సుకు ప్రపంచమంతటా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టండి



గౌరు చరితకు పూలబొకే ఇస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఆగస్టు 21: వాటర్‌షెడ్ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం హుశేనాపురం గ్రామానికి చెందిన వాటర్‌షెడ్ చైర్మన్ చంద్ర పెద్దస్వామి, ఉప చైర్మన్ రాధా, సెక్రటరీ పెండేకంటి కుమార్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హుశేనాపురం గ్రామంలో నూతనంగా కమిటీ ఏకగ్రీవం కావడం అభినందనీయమన్నారు. నాయకులు కేవీ మధు, షమీవుల్లా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు భవనాలను అప్పజెప్పాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 21: కర్నూలు కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లోని సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం భవనాలను కేవీఆర్ జూనియర్ కళాశాలకు వెంటనే అప్పజెప్పాలని నంద్యాల జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి డా. చెన్నయ్య జిల్లా సమన్వయ కర్త అభిరుచి మధు బుధవారం కోరారు. హైకోర్టు ఉత్తర్వులు, లోకాయుక్త, కలెక్టర్ ఉత్తర్వులు ఆదేశాలు ఇచ్చినా కేవీఆర్ జూనియర్ కళాశాలకు అప్పజెప్పాల్సిన భవనాలను ఇప్పటికీ బదిలీ చేయలేదన్నారు. 2024 జనవరి 9వ తేదీలోగా భవనాలు అప్పజెబుతామని కేవీఆర్ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చెప్పినప్పటికీ ఆ భవనాలను నేటికి స్వాధీనం చేయలేదన్నారు. రూసా నిధులతో డిగ్రీ కళాశాలకు సైన్స్ ల్యాబ్, లైబ్రరీ కోసం భవనాలు నిర్మించారని తెలిపారు. అయినా జూనియర్ కళాశాల యజమాన్యం తమకు భవనాలు స్వాధీనం చేయలేదని అన్నారు. కలెక్టర్, రాజకీయ ప్రతిని ధులు భవనాలను కళాశాలకు స్వాధీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జూడాల దీక్షకు ఎంపీ, ఎమ్మెల్యే సంఘీభావం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత, ఎంపీ నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 21: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య అత్యంత బాధాకరమని, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటనను నిరసిస్తూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో జూనియర్ డాక్టర్లు నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలకు కర్నూలు ఎంపీ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జూడాలు కోరుతున్న సీపీఏ చట్టం అమలు కోసం కేంద్ర మంత్రులతో చర్చిస్తానని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సంఘీభావంగా మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బజారుకు రాష్ట్రంలోనే గుర్తింపు

» అభినందించిన మార్కెటింగ్ శాఖ కమిషనర్
» విస్తరించేందుకు నిధులు కేటాయిస్తానని హామీ



రైతుబజారు విస్తరణకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 21: కర్నూలు నగరంలోని సీ.క్యాంపు రైతుబజారులో ప్రతి రోజు రైతులు అదే విధంగా ప్రజలు వేలాదిగా తరలివస్తుండటం ఎంతో సంతోషాన్నిచ్చిందని ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకుంటున్నందుకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత అధికారులను, సిబ్బందిని అభినందించారు. రోజూ ఎంత మంది రైతులు, పొదుపు లక్ష్మి మహిళలు సీ.క్యాంపు రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వస్తున్నదీ ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతుబజారును విస్తరించేందుకు గతంలో కేటాయించిన రూ.4 కోట్లను విడుదల చేస్తే పనులు చేపడుతామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీఈఈ సుబ్బారెడ్డి, ఏడీఎం నారాయణమూర్తి, కర్నూలు సెక్రటరీ గోవిందు, ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు చిన్నస్వామి, శ్రీనివాసరెడ్డి, గురువయ్య, గోపాల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు అందించండి : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుబజార్లను నిర్వహిస్తోందని, లక్ష్యం మేరకు కూరగాయలకు గిట్టుబాటు ధరకు రైతులకు అందేలా చూడాలని, మరోవైపు ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం కర్నూలు నగరంలోని సీ.క్యాంపు రైతుబజారులో కూరగాయల అమ్మకాలను పరిశీలించారు. రైతులను గిట్టుబాటు ధర అందుతుందా లేదా అని వివరాలు తెలుసుకున్నారు. కమిషనర్ వెంట మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి, ఏడీఎం నారాయణమూర్తి, ఎస్టేట్ అధికారి హరీష్ పాల్గొన్నారు.

'కబ్జాదారుల నుంచి మసీదు స్థలాన్ని కాపాడాలి'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 21: భూకబ్జాదారుల నుంచి బుడాన్ ఖాన్ మసీదు స్థలాన్ని కాపాడాలని ఆవాజ్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం కలెక్టరేట్, వక్ఫ్‌బోర్డు కార్యాలయాల ఎదుట ఆవాజ్ కమిటీ సభ్యులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ సుభాన్, బుడాన్‌ఖాన్ మసీదు కమిటీ కార్యదర్శి మునీర్ అహ్మద్‌లు మాట్లాడుతూ నగరంలోని జోహరపురం పరిధిలోగల 19వ వార్డు సర్వే నెంబరు 154 భూమిలో రాజకీయ నాయకులు వారి అనుచరులు భూకబ్జాలు చేశారన్నారు. వక్ఫ్ భూములను అన్యాక్రాంతం కాకుండా తక్షణమే ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్, మసీదు సభ్యులు యాకూబ్, నాజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయండి

సి.బెళగల్, ఆగస్టు 21: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని విద్యాకమిటీ చైర్మన్లు వేంకటేష్, గోవిందు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కోరారు. బుధవారం ఎమ్మెల్యేను స్వగృహంలో వారు ఆయన్ను మర్యాద పూర్వ కంగా కలిసి పూలమాలలతో సన్మానించారు. ఈసందర్భంగా విద్యాకమిటీ చైర్మన్ వేంకటేశ్ మాట్లాడుతూ జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మిం చాలని కోరారు. గ్రామ సర్పంచ్ రామంజినేయులు, ఎంపీటీసీ రేణుకమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్లు వెంకటేశ్వర్లు, రాముడు, రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేయర్, మాజీ ఎమ్మెల్యేపై కరపత్రం

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 21: నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అక్రమాలపై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన కరపత్రం కలకలం రేపుతోంది. బుధవారం నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రైవేటు కార్యాలయాలు, ప్రదానకూడళ్లలో ఈ కరపత్రాలను పంచిపెట్టారు. మేయర్, మాజీ ఎమ్మెల్యే రాజకీయ వ్యాపారం చేశారని, అక్రమ సంపాదన కోసం ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో షెడ్యూల్ కుల పేద మహిళలను మోసం చేసి కోట్ల రూపాయలను దోచుకున్నారని కరపత్రంలో పేర్కొన్నారు. మేయర్, మాజీ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఏసీబీ, సీఐడీకి కేసును బదిలీ చేసి పూర్తి స్థాయి విచారణ జరిపించాని కరపత్రంలో డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 21: స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియం లో జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ ఉషూ ఎంపిక పోటీలను పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఉషూ కోచ్ శ్రీనివాసులు, ఒలిం పిక్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సునీల్ కుమార్, అవినాశ్ పాల్గొన్నారు.

త్రీటౌన్ ఏఎస్ఐ బదిలీ

కర్నూలు, ఆగస్టు 21: త్రీటౌన్ ఏఎస్ఐ కృష్ణమోహన్ రెడ్డిని బదిలీ చేస్తూ ఎస్పీ బిందు మాధవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమే ఈయనను చిప్పగిరికి బదిలీ చేస్తూ ఎస్పీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయన బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందని చర్చ సాగుతోంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఎస్ఐ

గూడూరు, ఆగస్టు 21: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ హనుమంతయ్య అన్నారు. బుధవారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు - ఆర్ ఖానాపురం రోడ్డులో ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు.

జాతీయ స్థాయి కరాటేలో జిల్లాకు పతకాలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 21: హర్యానా రాష్ట్రంలోని పంచకులలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన ఇరువురి క్రీడా కారులు రజిత, కాంస్య పతకాలు సాధించారని రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్ బుధవారం తెలిపారు. బనగా నపల్లెకు చెందిన దివ్య రజిత, ఎం.చైతన్య రెడ్డి కాంస్య పతకాలు సాధించారన్నారు.

కార్మికులు కళ్లను కాపాడుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 21: కార్మికులు తమ కళ్లను కాపాడుకోవాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం.బాలునాయక్ సూచిం చారు. సుశీల నేత్రాలయ అధినేత, కంటి వైద్యనిపుణుడు డాక్టర్ సుధాక ర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం 48వ వార్డు రోజా వీధిలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని డాక్టర్ సుధాకర్‌రావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ కేజీ.గంగా ధర రెడ్డిలు ప్రారంభించారు. కార్మిక శాఖ ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లు, సహాయ అధికారి కేశన్న, డాక్టర్ చందు, నాగార్జున, మద్దమ్మ, దేవదాస్ పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కుట్రలను వ్యతిరేకిస్తాం



రాస్తారోకో నిర్వహిస్తున్న మాల సంఘాల నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 21: దేశంలో ఎన్‌డీఏ కుట్రలను వ్యతిరేకి స్తామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ యాట ఓబులేసు అన్నారు. బుధవారం భారత్‌బంద్‌లో భాగంగా సీ.క్యాంపు సెంటర్‌లో మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ఎన్‌డీఏ కుట్రపూరిత ఆలోచనతో ఐక్యతతో ఉన్న దళితులను విడగొట్టాలని చూస్తుందన్నారు. రానున్న రోజులలో రిజ ర్వేషన్ ఎత్తివేసే ఆలోచనలో భాగంగా ఈ తీర్పు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ మాదాసు నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు ఎనుమల రాజ్, నాయకులు సుధీర్, దామోదరం రాధాకృష్ణ, వేల్పుల విజయ్ పాల్గొన్నారు.

వ్యాధుల నివారణ చర్యలు చేపట్టండి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 21: భారీ వర్షాల నేపథ్యంలో పారిశుధ్యం, వ్యాధుల నివారణ పరిస్థితులపై మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల కారణంగా పలు గ్రామాల్లో వరద నీరు రావడంతో తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలకు వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. వర్షాల కారణంగా దాదాపు 7 మండలాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నివేదికలు ఇచ్చారన్నారు. వరద నీరు వచ్చిన గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీల ద్వారా శానిటేషన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి. నవ్య, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, డీపీవో నాగరాజనాయుడు, మండల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఓర్వకల్లు, ఆగస్టు 21: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సునీల్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో విద్యా ర్థులతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నారాయణ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హనుమంతయ్య సూచాంచారు. బుధవారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ ఖానాపురం గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అశ్వగంధ మూలికతో ప్రయోజనం

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 21: అశ్వగంధ మూలిక క్యాన్సర్, మానసిక ఒత్తిడి, నరాల బలహీనత తగ్గిస్తుందని సమాచార డిప్యూటీ డైరెక్టర్ కె.జయమ్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కర్నూలు జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అశ్వగంధ మూలిక (పెన్నేరు గడ్డ విత్తనాలు) పంపిణీ చేశారు. కె. జయమ్మ మాట్లాడుతూ అశ్వగంధ మూలిక అనేక రోగాలకు ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ జర్నలిస్టు సామేల్, ఫొటోగ్రాఫర్ కరణ్, సుధాకర్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 21: ఉల్చాల- రేమట పెండింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని అర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవలేదన్నారు. స్పందించిన ఎంపీ వెంటనే ఫోన్ ద్వారా రహదారి పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని అడి గి తెలుసుకున్నారు. అశోక్, సురేష్, వసంత్, విజయ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

సి.బెళగల్, ఆగస్టు 21: రైతుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, టీడీపీ మాజీ మండల కన్వీనర్ ఎంపీటీసీ ఈరన్నగౌడు తహసీల్దార్‌ను కోరారు. బుధవారం ఇటీవల విధుల్లో చేరిన తహసీల్దార్ విజయశ్రీని మండల టీడీపీ నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకుడు గఫూస్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, గోవిందు, బీసన్న ఉన్నారు.

చంద్రబాబును కలిసిన మల్లెల రాజశేఖర్



చంద్రబాబుకు పూలబొకే ఇస్తున్న రాజశేఖర్ దంపతులు

ఓర్వకల్లు, ఆగస్టు 21: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో మండల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఆయన సతీమణి మల్లెల జ్యోతి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మల్లెల రాజశేఖర్ కాల్వ బుగ్గ రామేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. 5 శాతం కంట్రిబ్యూషన్ చెల్లిస్తే రూ.5 కోట్లు నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 21: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని గురువారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు అంతర్ పాఠశాలల బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు బుధవారం తెలిపారు. అథ్లెటిక్ క్రీడాంశాల వివ రాలిలా ఉన్నాయి. 22న అథ్లెట్, జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, 23న బాస్కెట్ బాల్ (బాల బాలికలు), ఖో-ఖో (బాలురు), 24న బాస్కెట్‌బాల్, ఖో-ఖో (బాలికలకు), స్కేటింగ్, సెపక్‌తక్రా, యోగా, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్ ఈ నెల 25న రగ్బీ బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో తెలి పారు. విజేతలకు ఈనెల 29న కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా మెడల్స్ అందజేస్తారు.

24 వరకు బదిలీల దరఖాస్తు గడువు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో.నెం.75 ప్రకారం పంచాతీరాజ్ శాఖలో సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులకు విస్తరణాధికారులకు బదిలీ ప్రక్రియ చేపట్టినట్లు డీపీవో నాగరాజు నాయుడు తెలిపారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బంది, ప్రత్యేక పరిస్థితులు ఉన్నటువంటి వారికి అభ్యర్థన బదిలీలు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇందు కోసం సంబంధిత ఎంపీడీవో ఈ మెయిల్ ద్వారా దరఖాస్తులను డీపీవో కార్యాలయానికి పంపవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఉద్యోగులు నేరుగా డీపీవో కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వారు పరస్పరం జిల్లా మారాలనుకుంటే రెండు జిల్లాల డీపీవో కార్యాలయాల్లో దరఖాస్తు ప్రతులు సమర్పించాలన్నారు.

ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 21: నగర పాలక సంస్థ ఉద్యోగులు తమ పాన్ కార్డును ఆధార్ కార్డుతో త్వరితగతిన అనుసంధానం చేసుకోవాలని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. పాన్‌కార్డుతో అనుసంధానం చేసుకోక ఆదాయపు పన్ను శాఖ అధికారుల విధించబడిన ఉద్యోగుల, సిబ్బందితో బుధవారం నూతన కౌన్సిల్ హాలులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పాన్‌కార్డుతో అనుసంధానం చేయకపోవడంతో ఆదాయపుపన్ను శాఖ అధికారులు 186 మంది ఉద్యోగులను జరిమానా విధించారన్నారు. వాటిని త్వరగా చెల్లిస్తే 20 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. అదేవిధంగా త్వరితగతిన జరిమానాలు చెల్లిస్తే డిసెంబరు 24న ఆదాయపు పన్ను శాఖ రీఫండ్ చేస్తుందన్నారు. సమావేశంలో ఎస్ఈ డి.వేణుగోపాల్, డీసీపీ సంధ్య, మేనేజర్ చిన్నరాముడు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్‌యూ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 21: యువత అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించాలని రాయలసీమ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. ఈనెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పోటీల పోస్టర్‌లను ఆయన తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా ప్రతిఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తున్నారని, ఆ స్ఫూర్తితో లయన్స్ క్లబ్ ప్రతిభా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్‌యూ రిజిస్ట్రార్ సముద్రాల వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ శ్యామలా సరోజిని, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

వెల్దుర్తి, ఆగస్టు 21: రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. బుధవారం వెల్దుర్తిలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పురుషుల, స్త్రీల వార్డులను, ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులతో మాట్లాడారు. వైద్యశాలలో జనరేటర్, ఆర్వో వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేయించాలని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, డీసీహెచ్ఎస్ డా.మాధవి, పీడియాట్రిక్ డాక్టర్ బాలచంద్రారెడ్డి, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, ఎంఈఓ ఇందిర పాల్గొన్నారు.

వేధించడం సరికాదు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 21: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని పాఠశాలల యాజమాన్యాలు వేధించడం సరికాదని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు దినాల్లో కూడా పాఠశాలలకు రావాలని చెప్పడం సరికాదన్నారు. సమావేశంలో ఎర్రన్న, సిద్దరాముడు, అఫ్జల్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కళ్లు తెరిపిస్తాం : టీడీపీ



పోస్ట్ కార్డులు చూపుతున్న టీడీపీ నాయకులు

ఆదోని, ఆగస్టు 21: మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కళ్లు తెరిపిద్దామన్న ఉద్దేశంతోనే పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్టు టీడీపీ నాయకులు తెలిపారు. గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డులు రాశారు. ఆదోని పట్టణ నడిబొడ్డున్న ఉన్న వైసీపీ కార్యాలయం అక్రమ కట్టడమని నిరూపితమైందన్నారు. ఫేక్ డాక్యుమెంట్ల ద్వారా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా ఆ కేసు నిలబడదని, న్యాయం గెలుస్తుందని అన్నారు. ముందుగానే కేసును విత్ డ్రా చేసుకుంటే పట్టణ ప్రజలు కూడా క్షమిస్తారని అన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

గోనెగండ్ల, ఆగస్టు 21: వర్షం కోసం గ్రామస్థులు తుంగభద్ర నదికి వెళ్లి అక్కడి నీటిని తెచ్చి గ్రామ దేవతలకు బుధవారం పూజలు చేశారు. చింతలాముని, నల్లారెడ్డి, మారెమ్మ, సుంకులమ్మ, ఆంజనేయస్వామి, ఈశ్వర దేవాలయాల్లోని దేవలతలకు తుంగభద్ర నది నీటితో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలు వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో మరో నాలుగు రోజులు చేస్తున్నట్లు రైతులు తెలిపారు.

ఆక్రమణదారులను ఉపేక్షించవద్దు

వెల్దుర్తి, ఆగస్టు, 21: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిన ఉపేక్షించ వద్దని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప అధ్యక్షతన మండల అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. ఆక్రమణదారులను ఉపేక్షించవద్దని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఆస్పరి, ఆగస్టు 21: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు, రంగస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో రాధమ్మకు వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని జోహరాపురం, చిరుమాన్‌దొడ్డి, చిగిలి, నగరూరు, తంగరడోన, వలగొండ, ములుగుంద తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ఎంపీడీవో ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెద్దకడుబూరు: హనుమాపురం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. బుధవారం కర్నూలులోని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్ట్ 21 : ఎమ్మిగనూరు పట్టణంలో రాఘవేంద్ర కాలనీలో రూపాల రుపేంద్ర (38) చికిత్స పొందుతు బుధవారం మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం పురుగులు మందు తాగాడు. కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను శిక్షించాలి

గోనెగండ్ల, ఆగస్టు 21: కోల్‌కత్తాలో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేసిన దండగులకు శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు పవన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.

మద్దికెర: కోల్‌కత్తాలో మెడికల్ విద్యార్థిని అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని ఆపద్బాంధవ సేవా సమితి వ్యవస్థాపకులు చొక్కా సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం పలు పాఠశాలల్లో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మిగనూరు టౌన్: కోల్‌కత్తాలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం హత్య ఘటనను నిరసిస్తూ సీఐటీయూ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గోవిందు, రాముడు, గోవర్ధనమ్మ, నాగలక్ష్మి నీరజ, లక్ష్మి, శారద పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

పత్తికొండ, ఆగస్టు 21: పత్తికొండ పట్టణానికి చెందిన ఓ బాలిక జూన్ 25వ తేదీ పాఠశాలకు వెళ్లి ఇంటికి రాలేదని పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు అనుమానితుడైన కురువ రాఘవేంద్ర కదలికలపై నిఘా ఉంచారు. ఈ నెల 20వ తేదీ రాఘవేంద్ర కదలికల ఆధారంగా అతని దగ్గర ఉన్న బాలికను తప్పించి స్టేషన్‌కు తరలించారు. బుధవారం రాఘవేంద్రను అదుపులోకి తీసుకొని బాలిక కిడ్నాప్, పోక్సో చట్టాలను నమోదు చేసినట్లు సీఐ జయన్న తెలిపారు. నిందితుడిని మేజిస్ట్రేట్‌లో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వర్షార్పణం

● భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

● తీవ్రంగా నష్టపోయిన రైతులు

పంటలన్నీ వరద పాలయ్యాయి. సోమ, మంగళవారాల్లో కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. మరోవైపు పలు చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. పలు గ్రామాలకు ఇప్పటికీ రాకపోకలు సాగడం లేదు. బుధవారం జేసీ వరద ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.



హత్తిబెళగల్ కొట్టుకుపోయిన కంది పంట



వరద ఉధృతికి ఇసుక రాళ్లు తేలిన పొలం





హొసళ్లిలో దెబ్బతిన్న టమోటా పంటను చూపుతున్న మహిళ



తుగ్గలిలో నీట మునిగిన పంటలు



దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు



బాపురం వద్ద రోడ్డుపై వాగు నీరు



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

రైతులను ఆదుకుంటాం: జేసీ

పత్తికొండ: నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. ఆర్డీవో రామలక్ష్మితో కలసి చిన్నహుల్తి సమీపంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడారు. అధికారులు పంటనష్టం అంచనా వేస్తున్నారని ఆమె రైతులకు తెలిపారు. పెద్దహుల్తి, చిన్నహుల్తి, జూటురు, నలకదొడ్డి గ్రామాల పరిధిలో సుమారు 324 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 387 మంది రైతులు నష్టపోయినట్లు జేసీకి వివరించారు. జేసీ వెంట జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏవో వెంకటరాముడు, హార్టికల్చర్ అధికారి దస్తగిరి ఉన్నారు.

తుగ్గలి, ఆగస్టు 21: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంటలు నీటి పాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగుడి, లక్ష్మీ తండా, జాప్లా తండా, మిద్దె తండాల్లో సాగు చేసిన వేరుశనగ, కంది, సద్ద, మిరప, టమోటా పంటలు దాదాపు వెయ్యి ఎకరాల్లో నీట మునిగిపోయినట్టు తెలుస్తోంది. రూ.లక్షల్లో ఖర్చు పెట్టి సాగు చేసిన పంటలు నీటిలో కొట్టుకుపోవడంతో ఏమి చేయాలో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు. నష్టపరిహారంతోపాటు ఉచితంగా విత్తనాలు, ఎరువులను అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆరేళ్లకు నిండిన జొన్నగిరి చెరువు

ఆరేళ్ల తరువాత జొన్నగిరి చెరువు నిండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వంకలు, వాగులు పొంగి జొన్నగిరి చెరువుకు నీరు చేరింది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తుగ్గలి: నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ తాలుకా రైతు సంఘం ఉపాధ్యక్షులు బాలన్న, విద్యా కమిటీ చైర్మన్ రవి యాదవ్ కోరారు. భారీ వర్షాలకు పంటలు కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

మా ప్రాణాలు పోతే ఎలా...?

మద్దికెర: వరద నీరు వచ్చి ప్రాణాలు పోతే బాధ్యులెవరంటూ తహసీల్దార్ ఉశేన్‌సాహెబ్‌ను గ్రామస్థులు నిలదీశారు. బుధవారం మండలంలోని మదనంతపురం గ్రామాన్ని తహసీల్దార్ ఉశేన్‌సాహేబ్ పరిశీలించారు. గ్రామస్థులు తహసీల్దార్‌తో మాట్లాడారు. రాత్రి సమయాల్లో పెద్ద ఎత్తున నీరు వస్తే తమ ప్రాణాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మద్దికెరలో భారీ వర్షం

మద్దికెర మండలం మదనంతపురం, కొత్తపల్లి, బొమ్మనపల్లి గ్రామాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. పంటలు మొత్తం మునిగిపోయాయి. మదనంతపురం గ్రామంలోని శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. బొమ్మనపల్లి, కొత్తపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

తెగిపోయిన దేవరబెట్ట కల్వర్టు రోడ్డు

కోసిగి: మండల పరిధిలోని దేవరబెట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రధాన రోడ్డు కల్వర్టు వర్షం నీటికి కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఐదేళ్లలో మూడు సార్లు భారీ వర్షానికి రోడ్డు తెగిపోయినా అధికారులు నామమాత్రపు పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.

ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి

దేవనకొండ: ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు జేసీ బి.నవ్యకు వినతి పత్రం ఇచ్చారు. మండలంలో 1200 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్ తెలిపారు. జేసీని కలిసిన వారిలో నాయకులు బజారి, యూసుఫ్ బాషా, సుధాకర్, రవి ఉన్నారు.

హాలహర్వి: మండలంలోని వర్షం జోరు తగ్గలేదు. ఉరుములు, మెరుపులతో రాత్రంతా కురిసిన భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. వంకలు, వాగులు వరదలతో పోటెత్తడంతో సమీపంలో ఉన్న వరి, పత్తి, మిరప, టమోటా పంటలు పూర్తిగా దెబ్బతినటం వల్ల తీరని నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలూరు రూరల్: కల్లివంక వరద ఉధృతి వల్ల మిరప, పత్తి, జొన్న, కంది పంటలు నీట మునిగాయని రైతులు చిదానందగౌడ్, ధనంజయ, చంద్రబాబు, లక్ష్మన్న, గురుస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు-గుంతకల్లు రహదారిలో కల్లి వంక వంతెన వద్ద ముళ్ల కంప రోడ్డుపైకి వచ్చి పడింది. కల్లి వంక వద్ద వంతెన ఎత్తు పెంచి నిర్మాణాలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పత్తికొండ టౌన్: వరద బాధిత రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చిన్నహుల్తి సమీపాన హంద్రీ వంక పరివాహక ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజాసాహెబ్, కారన్న, వీరన్న, గురుదాస్, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: ప్రభుత్వం ప్రతి రైతును ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు కోరారు. బుధవారం నందవరం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మన్సూర్, బీమన్న, రజాక్, జబ్బార్, తిప్పన్న పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పరిశీలన

ఎమ్మిగనూరు, ఆగస్టు 21: ఎమ్మిగనూరు పట్టణ సమీపంలోని ఆదోని రోడ్డులో ఉన్న మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం కేంద్ర ప్రభుత్వానికి చెందిన న్యాక్ పీర్ టీం పరిశీలించింది. కళాశాలకు వచ్చిన టీం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ గోపాల్ కుమార్ నిరొల చెట్టి, సభ్యులు ప్రొఫెసర్ మ్రిన్‌మాయ్ కుమార్ శర్మ, డా. జస్మైన్ మథియల్గాన్‌లు కళాశాల పరిసరాలను, వివిధ విభాగాల ల్యాబ్‌లను, డిజిటల్ క్లాస్‌రూంలు, లైబ్రరీ, మీటింగ్ హాల్‌ను, పరిపాలన భవనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అవగాహన పెంచుకోవాలి

ఆలూరు రూరల్, ఆగస్టు 21: రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ ఇస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫార్మర్ కలెక్షన్ సెంటర్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ నవీన్, ఎసీయం ఆంజనేయ్య, సీసీలు నాగవేణి, మల్లికార్జున, ఉమాపతి పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

ఆస్పరి, ఆగస్టు 21: మండలంలో మాల మహానాడు నాయకులు బుధవారం తలపెట్టిన బంద్ ప్రశాతంగా సాగింది. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది, భరత్ బీఎస్పీ ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి రామలింగయ్య మాట్లాడుతూ రాజకీయ స్వలాభం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేశాయన్నారు. రాజకీయ ఎత్తుగడలతో అన్నదమ్ముల లాంటి ఎస్సీలను విభజించడం తగదన్నారు. వర్గీకరణ వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో మళ్లీ పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసప్ప, లక్ష్మన్న, చిన్న ఈరన్న, పెద్దయ్య, సిద్ధరాముడు, ఈరన్న, హరి, రంగస్వామి, రమేష్, కృష్ణ, శివ రాముడు, పవన్, ఉమాకాంత్, బాలు పాల్గొన్నారు.

ఆదోని (అగ్రికల్చర్): సుప్రీంకోర్టు మాల, మాదిగలను విడదీయడం అన్యాయమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నాయకులు కల్లుబోతుల రంగన్న, ఆంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలో భారత్ బంద్ పాక్షికంగా జరిగింది. ఉదయం ఐదు గంటలకే రోడ్డుపైకి చేరినప్పటికీ పోలీసులు వారిని అడ్డుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిరాం, ఉమేష్ నరసింహ, ఎర్రిస్వామి, నాగరాజు, శివతాయప్ప, సంజయ్ వీరేష్ పాల్గొన్నారు.

ఆలూరు: మాల మహానాడు నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేసి హౌస్ అరెస్టు చేశారు. అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని ఆలూరు తాలూకా అధ్యక్షుడు గోపాల్, నాయకులు ఈరన్న, లక్ష్మీనారాయణ, వన్నూర్, నాగరాజు అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం మాల వర్గానికి నష్టం చేకూరేలా ఉందన్నారు.

ఎమ్మిగనూరు టౌన్ : వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని మాల మహానాడు నాయకులు అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలో పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న, రాజోలప్ప, పంపయ్య, చెన్నయ్య, మధుబాబు, జట్టప్ప, లక్ష్మణ పాల్గొన్నారు.



పాఠశాలను బంద్ చేయించిన మాల మహానాడు నాయకులు

మార్కెట్ యార్డుల్లో రైతులకు భోజనం

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత



అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 21: ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులకు మరింత మెరుగైన వసతులతోపాటు భోజన సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత అన్నారు. బుధవారం ఉదయం ఆమె వ్యవసాయ మార్కెట్ కమిటీని తనిఖీ చేశారు. వర్షానికి వేరుశనగ తడిసిపోయి రైతులు నష్టపోవడంతో ప్లాట్‌ఫాంను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం కడప జాయింట్ డైరెక్టర్ రామాంజినేయులు, ఏడీఎం నారాయణమూర్తి, డీడీఏ శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వ హించారు. మార్కెట్ కమిటీల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించా లని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసి యే షన్ రాష్ట్ర గౌరవ సలహాదారులు శ్రీరాములు కోరారు.

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత బుధవారం పరిశీలించారు. మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తెచ్చిన రైతులతో మాట్లాడారు. కమిషనర్ వెంట జేడీ రామాంజనేయులు, ఏడీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి, కార్యదర్శి పద్మావతి ఉన్నారు.

ఆదోని సబ్ కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు

ఆదోని, ఆగస్టు 21: అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు జాయింట్ కలెక్టర్ బీ నవ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీ విశ్వనాథ్, బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఏవో వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాస రాజు, తహసీల్దార్ శివ రాముడు, ఉప తహసీల్దారులు రుద్రగౌడ్, రామేశ్వర్ రెడ్డి, వలి భాష, దీపా, వినీత్, కార్యాలపు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ఆలూరు, ఆగస్టు 21: ఆలూరు అసెంబ్లీ పరిధిలోని ఆరు మండలాల్లో ప్రత్యేక ఓటర నమోదు, సవరణ చేసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని ఆలూరు తహశీల్దార్ గోవింద్ సింగ్ బుధవారం తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఓటర్ జాబితాలో పేరులు లేని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మృతి చెందిన వారు ఉంటే తొలగిస్తారన్నారు. అక్టోబరు వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

తుగ్గలి, ఆగస్టు 21: నియోజకవర్గ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు చేపట్టినా, చట్టాలను అతిక్రమించినా చర్యలు తీసుకుంటామని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేయడంతో పాటు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పేకాట, మట్కా, అక్రమ మద్యం, నాటుసారా తయారీ, అక్రమ ఇసుక వంటి కార్యకలాపాలు చేపడితే గ్రామ బహిష్కరణ చేయిస్తామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారం కోసం రిలే దీక్షలు

మంత్రాలయం, ఆగస్టు 21: సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో రిలే దీక్షలు చేపడతామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విల్సన్ బాబు తెలిపారు. బుధవారం మంత్రాలయం ఎంఆర్‌సీ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో గిడ్డయ్య, షాబీర్ బాషా పాల్గొన్నారు.

నిందితులపై కేసు నమోదు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 21: గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామానికి చెందిన మాల రాఘవేంద్రపై దాడి చేసిన మాల రంగయ్యతోపాటు మరి కొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమతా సైనిక్‌దళ్ రాయలసీమ కన్వీనర్ రంగయ్య, మధు, కడివెళ్ల రాఘవేంద్ర, దైవందిన్నె మల్లేష్‌లపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఎస్ఐగా శ్రీనివాసులు

నందవరం, ఆగస్టు 21: నందవరం ఎస్ఐగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ తిమ్మయ్య గూడురు మండలానికి బదిలీపై అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా బబొమ్మనహల్లి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఇక్కడకు వచ్చారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం

ఆదోని టౌన్, ఆగస్టు 21: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జీవన జ్యోతి వృద్ధాశ్రమంలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డా. గోపీనాథ్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపించాలని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాద్‌రావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి వంకదారు శ్రీనాథ్‌గుప్తా, వన్నప్ప రాజు, ఆశ్రమం ఇన్‌చార్జి ఫిలిప్ప సిబ్బంది వీరేష్, జంపన్న, హనుమంతమ్మ, రామయ్య పాల్గొన్నారు.


ప్రవర్తనలో మార్పు రావాలి

ఆలూరు, ఆగస్టు 21: ప్రవర్తనలో మార్పు కనిపించకపోతే గ్రామ బహిష్కరణ చేస్తామని ఆలూరు ఎస్సై వెంకట నరసింహులు హెచ్చరించారు. బుధవారం ఆలురు మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఎవరి పని వాళ్ళు చేసుకోవాలన్నారు. రాజకీయాలు, పాత కక్షల పేరుతో ఘర్షణలకు తావిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్య

ఆదోని, ఆగస్టు 21: ఆస్పరి మండలం చిగిలి గ్రామానికి చెందిన వడ్డె వీరేంద్ర (16) మంగళవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. చిగిలి గ్రామానికి చెందిన ఈరన్న కుమారుడు వీరేంద్ర మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో నగరూర్-అస్పరి రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్సై గోపాల్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బీవీ



మంత్రికి సమస్యను వివరిస్తున్న బీవీ

ఎమ్మిగనూరు, ఆగస్టు 21: నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం అమరావతి సచివాలయంలో కలిశారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని పంప్ హౌస్‌ల్లో మోటార్లు పని చేయడం లేదని వివరించారు. హంద్రీనీవా నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు రావలసిన నీటి వాటా, జీడీపీ మరమ్మతులు తదితర అంశాలపై చర్చించారు.

లోకేశ్‌ను కలిసిన ఉమాపతినాయుడు



ఆదోని, ఆగస్టు 21: కార్యకర్తలు అధైర్య పడొద్దు.. మీకు నేనున్నా నంటూ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారని ఆదోని టీడీపీ సీనియర్ నాయకుడు తెలిపారు. మంత్రి లోకేశ్‌ను కలిసి బుధవారం కలిసి ఆదోనిలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలను వివరిం చానని చెప్పారు. మీనాక్షి నాయుడుకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని లోకేశ్ చెప్పారని వివరించారు. అలాగే తెలుగు దేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కూడా కలిసినట్టు ఆయన తెలిపారు.